పి.వి.బి. శ్రీరామమూర్తి

# పాషాణాలు

ఎమ్.ఈ.ఓ గోవిందరావుగారూ యు.పి. స్కూల్లో వార్షిక తనిఖీ చేస్తున్నారు. తెలుగు క్లాసుకు వెళ్లారు. శాస్త్రిగారు గోవ్యాఘ్రసంవాదంలో పద్యాలు రాగయుక్తంగా చదివి పిల్లలు చేత చదివించారు.

పాఠం ముగించి ప్రశ్నలు వేశారు. వాళ్లూ జవాబులు చెప్పారు. వెనకటి పాఠాల్లో ప్రశ్నలు వేశారు. పిల్లలందరూ కరెక్టుగా సమాధానాలిచ్చారు. ఈ.ఓ గోవిందరావుకిదేం నచ్చలేదు. ఎలాగైనా టీచర్ని చీవాట్లు పెడితేగాని తన గొప్ప తెలవదనుకున్నాడు.

ఆ పాఠంలో ఓ చోట పాషాణం అన్న పదం వచ్చింది. ఓ కుర్రాణ్ణి లేపి "అబ్బాయ్! పాషాణం అనే పదం ఉపయోగించి స్వంతంగా ఒక వాక్యం చెప్పు" అన్నాడు.

తెలివైన కుర్రాణ్ణే గోవిందరావుగారు అడిగినా వాడు జవాబు చెప్పలేదు. దాంతో క్లాసులో ఎవరూ చెప్పలేదు. శాస్త్రిగారు కల్పించుకొని 'చూడండి అబ్బాయిలూ పాషాణం అంటే' అని బోర్డుమీద రాయబోతూండగా "నో దటీజ్ నాట్ ది కరెక్టు ప్రొసీజరు. వాళ్ల చేతనే చెప్పించాలి. నే చెప్పిస్తా మీరుండండి" అన్నారు.

"చూడండబ్బాయిలూ! మనం అన్నం తింటాంకదా! అన్నం ఎలా అవుతుందీ?" అన్నారు నవ్వుతూ.

"బియ్యం ఎసర్లో పోస్తే" ఓకుర్రాడు చెప్పాడు.

"బియ్యాన్ని చేటలో పోసి చెరుగుతారు ఎందుకని?"

"అందులో బెడ్డలుంటాయి" ఓ కుర్రాడు.

"ఇంకా ఏముంటాయి?"

"ధాన్యం" ఇంకో కుర్రాడు చెప్పాడు.

అనహనంగా కదిలారు గోవిందరావుగారు. అయినా తమాయించుకొని అప్పుడప్పుడు అన్నం తింటున్నప్పుడు పంటి క్రింద పడుతుంటాయి. పటుక్కుమంటాయి. ఏంటవి?

"రాళ్లు"



"గుడ్" ఎంతో గర్వంతో శాస్త్రివేపు చూసి అలా రాబట్టాలి పిల్లలనుండి. అంతేకానీ మనమే చెప్పేయకూడదు" అని కోపంగా చూసి "అబ్బాయ్.... అన్నంలో ఉన్నవాటిని రాళ్లు అంటామే అవి చిన్నవి. అవే బాగా పెద్దవయితే పాషాణం అంటాం. అర్థం అయిందా?" అన్నారు.

అర్థమయిందని కోరస్‌గా అరిచాడు పిల్లలు.

ఈ.ఓ. గోవిందరావుగారు ఎవరెస్ట్ ఎక్కినంత సంబరపడిపోయి ముందు వరసలో ఓ కుర్రాణ్ణి లేపి "ఇప్పుడు చెప్పరా అబ్బాయ్. పాషాణం అనే పదం ఉపయోగించి ఓ వాక్యం చెప్పు" అన్నారు.

"అన్నంలో పాషాణాలుండును' ఠపీమని చెప్పాడు కుర్రాడు.

అంతే!

గోవిందరావు కిమ్మనకుండా క్లాస్‌రూమ్ నుండి బయటపడ్డాడు.